నమస్తే తెలంగాణ
నిజామాబాద్
5 | నిజామాబాద్, గురువారం 18 జూలై 2024 | NIZAMABAD

గోదావరికి జలకళ

రెంజల్, జూలై 17: రెండు రోజులుగా తెలంగాణ, మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరిలో వరద మొదలైంది. రెంజల్ మండలం కందకుర్తి వద్ద బుధవారం గోదావరి పరుగులు పెడుతుంది. తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా పుణ్యస్నానాలు ఆచరించేందుకు నదిలో దిగిన భక్తులు పుష్కరఘాట్ల వైపు పరుగులు తీశారు. నదిలోని పురాతన శివాలయం చుట్టూ నీరు చేరుకున్నది. రెంజల్ మండలంలో 60మి.మీల వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ తెలిపారు. గోదావరిలో నీటి ప్రవాహం పెరుగుతున్న నేపథ్యంలో నదిలోకి వెళ్లకుండా పుష్కరఘాట్లపైన పుణ్యస్నానాలు ఆచరించాలని బోధన్ రూరల్ సీఐ కొల్ల నరేశ్, రెంజల్ ఎస్సై ఈ. సాయన్న ప్రజలను అప్రమత్తం చేశారు.

ఎస్సారెస్పీకి పెరిగిన ఇన్‌ఫ్లో

మోర్తాడ్, జూలై 17: ఎస్సారెస్పీలోకి ఎగువ నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతున్నది. బుధవారం ఎగువ నుం చి ఎస్సారెస్పీ లోకి 4468క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగింది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు (80.5 టీఎంసీలు) కాగా, మంగళవారం 1063.20అడుగులు (13.833 టీఎంసీల) నీరు నిల్వ ఉన్నది. ప్రాజెక్ట్ నుంచి 436 క్యూసెక్కులు అవుట్‌ఫ్లో కొనసాగుతున్నది.

భారీ వర్షాలతో వరద

కందకుర్తి వద్ద ప్రవహిస్తున్న గోదావరి

ఏకాదశి పూజలు



తొలి ఏకాదశిని పురస్కరించుకొని బుధవారం నిజామాబాద్ నగరంలోని విఠలేశ్వర మందిరంలో స్వామివారి దర్శనానికి బారులుతీరిన భక్తులు

పీరీల సవారీ

మొహర్రం పండుగ సందర్భంగా బుధవారం లింగంపేట మండలం భవానీపేట గ్రామంలో పీరీల సవారీ నిర్వహిస్తున్న భక్తులు

- పసుపుబోర్డు ప్రకటనకే పరిమితం
- ప్రధాని వాగ్దానానికి 10 నెలలు పూర్తి
- సర్క్యులర్ జారీ చేసి వదిలేసిన వైనం
- అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల తర్వాత ఊసే కరువు
- ఇచ్చిన హామీని మరిచిపోయిన బీజేపీ
- అతీగతీలేని పసుపుబోర్డు ఏర్పాటు ప్రక్రియ

పసుపుబోర్డు ఏర్పాటు మాటలకే పరిమితమైంది. ప్రధాని మోదీ స్వయంగా ప్రకటించినప్పటికీ అతీగతీ లేకుండా పోయింది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు తెలంగాణ పర్యటనకు వచ్చిన మోదీ పసుపుబోర్డుపై ప్రకటన చేశారు. పది నెలలు దాటిపోతున్నా అడుగు ముందుకు పడింది లేదు. దశాబ్దాల రైతుల కల నెరవేరిందీ లేదు. బోర్డు పేరిట ఎన్నికల ముందర హడావుడి చేయడం, ఆ తర్వాత వదిలేయడం బీజేపీకి అలవాటుగా మారింది. పసుపు రైతుల భావోద్వేగాలతో ఆటలాడడం అటు బీజేపీకి, ఇటు కాంగ్రెస్‌కు మాత్రమే చెల్లింది. మూడు దశాబ్దాలుగా రగులుతున్న పసుపు బోర్డు ఏర్పాటు ప్రక్రియను కేంద్రంలో అధికారాన్ని చెలాయించిన, చెలాయిస్తున్న ప్రభుత్వాలు పట్టించుకోలేదు. 2019 లోక్‌సభ ఎన్నికలకు ముందు కమలం పార్టీ నిజామాబాద్ అభ్యర్థి ధర్మపురి అర్వింద్ బోర్డు తీసుకొస్తానని బాండ్ పేపర్ సైతం రాసిచ్చారు. లేకపోతే రాజీనామా చేస్తానని చెప్పి రైతుల ఓట్లు దండుకున్నారు. ఎంపీగా గెలిచాక ఆ అంశాన్ని పట్టించుకోలేదు. ఐదేళ్ల క్రితం రాజ్‌నాథ్ సింగ్, ప్రకాశ్ జవదేకర్‌లు ఇచ్చిన మాటిచ్చి తప్పారు. సరిగ్గా మొన్నటి ఎన్నికల ముందర ఏకంగా ప్రధానమంత్రి మోదీ పసుపుబోర్డు అంశాన్ని తెరపైకి తీసుకొచ్చారు. బోర్డు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. కానీ, పది నెలలు గడుస్తున్నా అది కార్యరూపం దాల్చలేదు.

–నిజామాబాద్, జూలై 17 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

మోదీ మాటకు నో గ్యారంటీ!

పసుపు బోర్డు ఏర్పాటు విషయంలో ఆది నుంచీ భారతీయ జనతా పార్టీ తీరు నవ్విపోదురు గాక నాకేంటి అన్న చందంగా మారింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన కొత్తలో నిజామాబాద్ ఎంపీగా కల్వకుంట్ల కవిత ఇదే అంశంపై పార్లమెంట్‌లో తీవ్రంగా పోరాటం చేశారు. ప్రధాని మోదీకి, నాటి వాణిజ్య శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు దఫాదఫాలుగా వినతులు సమర్పించారు. 2017లో కవిత విన్నపాలకు స్పందించి నిజామాబాద్‌లో స్పైసెస్ బోర్డు ఎక్స్‌టెన్షన్ ఆఫీస్ ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నారు. కానీ ఈ ప్రతిపాదనను కవిత తిరస్కరించారు. తదనంతరం 2019 ఎన్నికల్లో తనను గెలిపిస్తే పసుపుబోర్డును ఐదు రోజుల్లోనే తెస్తానంటూ ధర్మపురి అర్వింద్ రైతులను మభ్యపెట్టి గెలిచాడు. ఐదేండ్ల తన పదవీ కాలంలో పాత హామీలో భాగంగా స్పైసెస్ బోర్డు ఎక్స్‌టెన్షన్ కార్యాలయం మినహా పసుపుబోర్డు ఏర్పాటే లేకుండా పోయింది. లోక్‌సభ, రాజ్యసభలో పసుపు బోర్డు ఏర్పాటుపై పలువురు ఎంపీలు కేంద్ర ప్రభుత్వానికి ప్రశ్నలు సంధించగా అలాంటి ఆలోచనే లేదని రాతపూర్వకంగా సమాధానాలు ఇచ్చారు. సీన్ కట్ చే స్తే, 2023 అసెంబ్లీ ఎన్నికల ముందు అక్టోబర్ 3, 4 తేదీల్లో తెలంగాణ పర్యటనకు వచ్చిన ప్రధాని మోదీ.. పసుపుబోర్డు ఏర్పాటు చేస్తామంటూ ప్రకటన చేశారు. ఇదే హామీని సాగదీస్తూ పార్లమెంట్ ఎన్నికల వర కూ పొడిగిస్తూ వచ్చారు. రైతులను నమ్మించేందుకు ఒక సర్క్యూలర్‌ను జారీ చేసి కేంద్ర సర్కారు చేతులు దులుపుకొన్నది.కానీ, మూడోసారి అధికారంలోకి వచ్చి రోజులు గడుస్తున్నా పసుపు బోర్డు ఊసే లేకుండా పోయింది. పసుపు బోర్డు విషయంలో బీజేపీ పాలకుల తీరు పదేళ్ల కాలంలో రకరకాలుగా మారుతుండగా, తుదకు ఏం జరుగుతుందో తెలియక అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

ఊసే కరువు..

ఎన్నికలు ముగియడంతో బీజేపీ నేతలెవ్వరూ ఇచ్చిన హామీలపై నోరు మెదపడం లేదు. పసుపుబోర్డు అంశాన్ని పక్కన పడేసినట్లు కనిపిస్తున్నది. గతంతో పోలిస్తే రాష్ట్రంలో బీజేపీ అత్యధికంగా 8 లోక్‌సభ స్థానాలను గెలుచుకున్నది. అందులో నిజామాబాద్ సిట్టింగ్ స్థానాన్ని నిలబెట్టుకున్నది. పసుపుబోర్డు పేరిట నిజామాబాద్‌లో బీజేపీ రెండుసార్లు గెలిచింది. అయినా ఆ హామీ నెరవేర్చింది లేదు. 2029లోనైనా పసుపుబోర్డు ఏర్పాటు అవుతుందా? అన్న సంశయం రైతుల్లో నెలకొన్నది. సాక్షాత్తు ప్రధాని మోదీ ఇచ్చిన హామీ 10 నెలలు దాటిపోయినా ఆచరణలోకి రాకపోవడంపై ఆశ్చర్యం కలిగిస్తున్నది. ఎంపీ అర్వింద్ మాత్రం ఈ అంశంపై ఎక్కడా నోరెత్తడం లేదు. ఎంపీగా రెండోసారి గెలిచిన తర్వాత బాధ్యతగా పసుపుబోర్డు ఏర్పాటుపై ప్రజలకు వివరాలు చెప్పాల్సి ఉం డగా, ఇంతవరకూ అలాంటి ప్రయత్నమే చేయడం లేదు. ఈ తీరును చూస్తుంటే అసలు పసుపుబోర్డు ఏర్పాటవుతుందా? మోదీ ఇచ్చిన మాట మేరకు తూతూ మంత్రంగా ఏర్పాటు చేస్తారా? చేస్తే ఎక్కడ చేస్తారు? అన్నది అంతు చిక్కడం లేదు. ఒకవేళా కేంద్రం పసుపుబోర్డు ఏర్పాటు విషయంలో సీరియస్‌గా ఉన్నట్లయితే ఇప్పటికే స్థల సేకరణకు ప్రయత్నాలు ప్రారంభమయ్యేవి. లేదంటే కార్యాలయాలు, పరిశోధన క్షేత్రాల కోసం కదలిక వచ్చేది. కానీ ఇంతవరకు నిజామాబాద్ జిల్లా యంత్రాంగానికి అలాంటి ఆదేశాలు రాకపోవడం కొసమెరుపు.

రైతులను మోసగించొద్దు..

పసుపుబోర్డు ఏర్పాటు నీటి మీది రాతలుగానే మిగిలిపోతున్నది. 2019లో బీజేపీని గెలిపిస్తే బోర్డు తెస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాటను బీజేపీ నిలబెట్టుకోలేదు. మొన్నటి ఎన్నికల్లో ఏకంగా ప్రధానమంత్రి హామీ ఇచ్చినా అతీగతీ లేకుండా పోయింది. మాట ఇచ్చి తప్పడం సరికాదు. దయచేసి రైతులను మోసం చేయొద్దు.

- శ్రీకాంత్ యాదవ్, పసుపు రైతు, బోదెపల్లి, బాల్కొండ



బోర్డు ఏర్పాటు చేయాలి

పంట చేతికొచ్చేలోపు ఎన్నికలకు ముందు పసుపుబోర్డు ఏర్పాటు చేస్తామని ప్రధానమంత్రి మోదీ స్వయంగా చెప్పిండు. పది నెలలు అవుతున్నది. ఇప్పటికే ఆ ఊసే లేకుండా పోయింది. పసుపు పంట వేసి నెల రోజులు దాటింది. పంట చేతికొచ్చేలోపు పసుపుబోర్డును కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేయాలి. బోర్డు వస్తుందని, గిట్టుబాట ధర వస్తదని రైతులు చాలా ఆశలు పెట్టుకున్నారు. రైతుల పక్షపాతి అని చెప్పుకునే బీజేపీ ప్రభుత్వం చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి.

- నాగులపల్లి రాజేశ్వర్, పసుపు రైతు, వన్నెల్(బి), బాల్కొండ



చోరీ చేసి.. కారంచల్లి..

- వెల్మల్‌లో దొంగల బీభత్సం
- తాళం వేసిన రెండిండ్లలో చోరీ
- భారీగా బంగారం, నగదు అపహరణ
- ఆధారాలు దొరక్కుండా కారంపొడి చల్లిన దుండగులు

ఆధారాలు దొరక్కుండా ఇంట్లో కారం చల్లిన దుండగులు, సీసీ కెమెరాలో రికార్డయిన దుండగుల చిత్రాలు(ఇన్‌సెట్‌లో..)

నందిపేట్, జూలై 17: తాళం వేసిన ఇండ్లలో చోరీ చేసి.. ఆపై ఆధారాలు దొరక్కుండా కారం చల్లి వెళ్లిన ఘటన నందిపేట మండలం వెల్మల్ గ్రామంలో చోటు చేసుకున్నది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వెల్మల్ గ్రామంలో తాళం వేసి ఉన్న రెండిండ్లలో మంగళవారం రాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. మార్కెట్ వీధిలో ఉండే ఆర్ఎంపీ బొడ్డు చంద్రశేఖర్ బంధువుల ఇంటికి వెళ్లగా.. గుర్తు తెలియని దుండగులు తాళం పగులగొట్టి ఇంట్లోకి చొరబడ్డారు. 10 తులాల బంగారం, రూ.10 లక్షల నగదును అపహరించారు. ఢీకంపల్లి రోడ్డులోని గొర్ల పాటి ప్రవీణ్ ఇంటి తాళాలు పగులగొట్టి 10 తులాల బంగారం, రూ.25 వేల నగదు ఎత్తుకెళ్లినట్లు బాధితులు తెలిపారు. బీరువా తాళాలు పగులగొట్టి అందులోని వస్తువులను చిందరవందర చేసి బంగారం, నగదును దోచుకెళ్లారు. చోరీ చేసిన అనంతరం పోలీసులకు ఆధారాలు లభించకుండా ఉండేందుకు దుండగులు కారం చల్లి వెళ్లారు. మధ్యాహ్న సమయంలో తాళం వేసిన ఇండ్లను గుర్తించి రాత్రి వేళ్లలో పక్కా ప్రణాళికతో తాళాలు పగలగొట్టి బంగారు, నగదు అపహరణకు పాల్పడ్డారు. దుండగులు చోరీకి పాల్పడిన దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయి. కాగా హెల్మెట్ ధరించడంతోపాటు ముసుగులు వేసుకొని చోరీకి పాల్పడినట్లు సీసీ కెమెరాల్లో రికార్డయ్యింది. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రాహుల్ తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా తిరిగితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

ఎంపీ సురేశ్‌రెడ్డికి వేముల సన్మానం

బీఆర్ఎస్ పార్లమెంటరీ నేతగా ఎన్నికై పార్లమెంట్ సమావేశాలు ముగిసిన అనంతరం హైదరాబాద్‌కు చేరుకున్న రాజ్యసభ సభ్యుడు కేఆర్ సురేశ్‌రెడ్డిని బుధవారం ఆయన నివాసంలో మాజీమంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. పుష్పగుచ్ఛాన్ని అందించి శుభాకాంక్షలు తెలిపారు. – మోర్తాడ్/వేల్పూర్, జూలై 17

- రూ.3కోట్ల25లక్షలు మాయం
- రుణాలు మంజూరు చేసి అకౌంట్ల నుంచి విత్‌డ్రా
- నోటీసులు రావడంతో కంగుతిన్న ఖాతాదారులు

ఖాతాదారులకు టోకరా

వినాయక్‌నగర్, జూలై 17: రుణాల కోసం బ్యాంకును ఆశ్రయించిన ఖాతాదారుల అకౌంట్స్ నుంచి సుమారు రూ.మూడున్నర కోట్లు మేనేజర్ కాజేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నిజామాబాద్ నగరంలోని న్యాల్‌కల్ రోడ్డులో ఉన్న యూనియన్ బ్యాంకు పెద్దబజార్ బ్రాంచీ మేనేజర్ తమ అకౌంట్ నుంచి డబ్బులు కాజేసినట్లుగా పెద్ద సంఖ్యలో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. నాల్గోటౌన్ ఇన్‌చార్జి ఎస్సై పాండేరావ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నగరానికి చెందిన పుల్లూరి రాకేశ్ అనే వ్యక్తి రుణం కోసం అవసరమైన షూరిటీ చెక్కులను బ్యాంకు మేనేజర్ అజయ్‌కు అందజేశారు. కొద్దినెలలుగా రాకేశ్ ఖాతా నుంచి ఆయనకు తెలియకుండానే రూ.20లక్షల విలువ చేసే చెక్కులను బ్యాంకు మేనేజర్ అజయ్ నగదుగా మార్చుకోవడంతో విషయం తెలుసుకున్న బాధితుడు నాల్గోటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో బ్యాంకు మేనేజర్ అజయ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పాండేరావు బుధవారం తెలిపారు.

నోటీసులతో బయటపడిన మరో మోసం..

ఇదే బ్యాంకులో ఖాతాదారులుగా ఉన్న 24మందికి డబ్బులు చెల్లించాల్సిందిగా బ్యాంకు నుంచి నోటీసులు రావడంతో బాధితులు కంగుతిన్నారు. తమకు జరిగిన మోసంపై నాల్గో టౌన్ పోలీసు స్టేషన్‌కు బుధవారం తరలివచ్చారు. రుణాలు తీసుకునేందుకు తమ చెక్కులను బ్యాంకులో షూరిటీగా పెట్టడంతో ఆ చెక్కుల ద్వారా తమ అకౌంట్‌లోని డబ్బులను మేనేజర్ డ్రా చేసుకొని మోసం చేశాడని బాధితులు వాపోయారు. మరో 24మంది బాధితులు ఫిర్యాదు చేయడంతో మేనేజర్ అజయ్‌పై కేసు నమోదు చేశామని నగర సీఐ నరహరి పేర్కొన్నారు. యూనియన్ బ్యాంకు ఖాతాదారుల అకౌంట్ నుంచి రూ.3 కోట్ల25 లక్షలు మేనేజర్ కాజేసినట్లుగా ఫిర్యాదు అందినట్లు తెలిపారు. మేనేజర్ కోసం వాకబు చేయగా అతడు పరారీలో ఉన్నట్లు తెలిసిందని, నిందితుడి కోసం అన్వేషిస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

ఆరు నెలలు గడుస్తున్నా నెరవేర్చని హామీలు

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి

కామారెడ్డి, జూలై 17 : కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఆరు నెలలు గడుస్తున్నా నెరవేర్చడం లేదని ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి అన్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార అధ్యక్షతన రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా

ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి

ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి మాట్లాడుతూ.. 10 ఏండ్ల కాలంలో మోదీ చేసిన అభివృద్ధితోనే మరోసారి కేంద్రంలో బీజేపీ వచ్చిందని అన్నారు. క్షేత్రస్థాయిలో పార్టీ ఇంకా బలపడాల్సి ఉందని చెప్పారు. ప్రజల మధ్య ఉంటూ ప్రజల కోసం పని చేస్తే స్థానిక సంస్థలో బీజేపీ విజయం సాధిస్తుందని తెలిపారు. రానున్న స్థానిక ఎన్నికలో వార్డు సభ్యుడిని మొదలుకొని జడ్పీ చైర్మన్ వరకు బీజేపీనే గెలుస్తుందన్నారు. ఉద్యోగాలు, మహాలక్ష్మి పథకం అమలు, రైతు రుణమాఫీ, రైతు భరోసా అమలు వంటి హామీల అమలు కోసం నిరుద్యోగులు, మహిళలు, రైతుల పక్షాన బీజేపీ రాష్ట్ర ప్రభుత్వంపై ఉద్యమం చేస్తుందని చెప్పారు. కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ.. గత పార్లమెంట్ ఎన్నికల్లో జిల్లాలో బీజేపీ ఆధిక్యత ప్రదర్శించిందని అన్నారు. బీజేపీని క్షేత్రస్థాయిలో బలపర్చాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి నేరళ్ల ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే గంగారాం, బీజేపీ నాయకులు మురళీదర్‌గౌడ్, బాణాల లక్ష్మారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.